క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిలుకూరు : మండలంలోని బేతవోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సీతారాంతండా, బేతవోలులో 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ రామిశెట్టి శ్రీనివాస్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

డీవైఎఫ్ఐ మండల నూతన కమిటీ ఎన్నిక




బచ్చలకూరి సురేందర్, అధ్యక్షుడు గడ్డం వినోద్, కార్యదర్శి

మునగాల : భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) మునగాల మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గురువారం మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక భవనంలో సంఘం జిల్లా కార్యదర్శి బోళ్ల నవీన్ సమక్షంలో జరిగిన 8వ మండల మహాసభలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ మండల అధ్యక్షుడిగా నేలమర్రి గ్రామానికి చెందిన బచ్చలకూరి సురేందర్, కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన గడ్డం వినోద్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా కందుల వెంకటేశ్వర్లు



హుజూర్‌నగర్ : సీపీఐ హుజూర్‌నగర్ మండల కార్యదర్శిగా కందుల వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు ఆధ్వర్యంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల సహాయ కార్యదర్శిగా ధనరాజ్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా సీహెచ్.కనకయ్య, శ్యాంసన్, మనోజ్, ఆనంద్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు మండవ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కోదాడ మండల కమిటీ ఎన్నిక



మండల కార్యదర్శి, సహాయ కార్యదర్శి హనుమంతరావు, రాజేశ్వరరావు

కోదాడరూరల్ : పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సీపీఐ మండల నాలుగవ మహాసభలో పార్టీ కార్యదర్శి, సహాయ కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా బత్తినేని హనుమంతరావు, సహాయ కార్యదర్శిగా పోతరాజు రాజేశ్వరరావుతో పాటు ఏడుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పోతరాజు సత్యనారాయణ, బొల్లు ప్రసాద్, మాతంగి ప్రసాద్, కొండా కోటేశ్వరరావు, కంబాల స్వామి, వస్తం సుందరయ్య, నగేష్ ఉన్నారు.

సబ్సిడీపై అందుబాటులో జీలుగ విత్తనాలు

పాలకవీడు : మండలంలోని రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి కళ్యాణచక్రవర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం జీరాక్స్‌తో మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. జీలుగ విత్తనాల 30 కేజీల సంచులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. 30 కేజీల బ్యాగు రూ.2137గా ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

150 బస్తాల జీలుగ విత్తనాలు మంజూరు

నడిగూడెం : ఖరీఫ్ సీజన్‌కు గాను మండలానికి 150 బస్తాల జీలుగ విత్తనాలు మంజూరైనట్లు మండల వ్యవసాయ అధికారి రాయపు దేవప్రసాద్ గురువారం తెలిపారు. 50 శాతం రాయితీపై రైతులకు శుక్రవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు, తొలి విడతగా ఒక్కో రైతుకు ఒక్కో బస్తా మాత్రమే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 30 కిలోల బస్తా రాయితీ పోను రూ.2137కు పంపిణీ చేస్తామని తెలిపారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జీరాక్స్‌లతో నడిగూడెం సహకార సంఘం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నియామకం

హుజూర్‌నగర్ : పట్టణంలో గురువారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకుల సమావేశం జరిగింది. సంఘం పట్టణంలోని 2వ వార్డు ఇన్‌చార్జ్ కొత్తూరి బ్రహ్మచారిని నియమిస్తూ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బొడ్డు గోవిందరావు, గడ్డం అంజి, రాయల వెంకటేశ్వర్లు, దీప, నరసింహచారి, కె.వెంకటేశ్వర్లు, యుగంధరాచారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డబుల్ రోడ్డుగా మారేదెప్పుడో..

- గుంతలమయంగా చిలుకూరు–దూదియాతండా రోడ్డు
- ఇరువైపులా రోడ్డు ఆక్రమణ
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- డబుల్ లైన్‌గా మార్చాలని ప్రజల వేడుకోలు



అధ్వానంగా చిలుకూరు- దూదియాతండా రోడ్డు

చిలుకూరు : చిలుకూరు మండల కేంద్రం నుంచి దూదియాతండా మీదుగా కోదాడ మండలం గుడిబండ వరకు రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డులో అడుగుకో గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు ఇరుపక్కల ఆక్రమణకు గురవడంతో ఇరుకుగా మారి ఎదురెదురుగా రెండు భారీ వాహనాలు వస్తే వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది. రోడ్డుకు ఇరువైపులా చిలుకూరు, దూదియాతండా, జానకీనగర్, గుడిబండ గ్రామాలకు చెందిన రైతుల పొలాలు ఉన్నాయి. రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, ధాన్యం తరలింపు కోసం లారీలు తిరుగుతుంటాయి. అంతేకాకుండా చిలుకూరు గ్రామ శివారులో దూదియాతండా రోడ్డులో వైన్స్ షాపులు రెండు ఒకే చోట ఉండడం, ఆ ప్రదేశంలో కాంటా మిషన్, గోదాం ఉండడంతో ఈ మార్గంలో వాహనాల రద్దీ ఉంటోంది.

ప్రయాణానికి ఇబ్బందులు..

దూదియాతండా రోడ్డు రెండు మండలాలను కలిపే ప్రధాన రహదారి. దీంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. కానీ ఇది సింగిల్ లైన్ రోడ్డు కావడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలని స్థానిక మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డికి పలువురు రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. డబుల్ లైన్ రోడ్డు నిర్మించేందుకు వారు కూడా సానుకూలంగా స్పందించినట్లు రైతులు చెబుతున్నారు. దూదియాతండా రోడ్డు డబుల్ లైన్‌గా మారితే ఇటు కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారి నుంచి మేళ్లచెరువు రోడ్డుకు కలుస్తుంది. ఈ ప్రాంత వాసులు మేళ్లచెరువు వెళ్లేందుకు కూడా సులభతరం అవుతుంది. కావున సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును డబుల్ లైన్‌గా మార్చాలని రైతులు కోరుతున్నారు.

డబుల్ రోడ్డుగా మార్చాలి



చిలుకూరు – దూదియాతండా రోడ్డులో అడుగడుగున గుంతలు ఏర్పడ్డాయి. ఇరుపక్కల ఆక్రమణకు గురికావడం, రద్దీగా ఉంటుండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయాన్ని మంత్రి, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. వారు సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి డబుల్ రోడ్డు నిర్మించాలి.

– అలసకాని వెంకటయ్య, రైతు, చిలుకూరు

నాణ్యమైన విత్తనాలు అందించాలి



మునగాలలో విత్తనాల దుకాణాల్లో తనిఖీ చేస్తున్న మండల ప్రత్యేక అధికారి శిరీష

మునగాల : ప్రస్తుత వానాకాలం సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని మండల ప్రత్యేక అధికారి శిరీష కోరారు. గురువారం మండల కేంద్రంలోని పలు ఎరువులు, విత్తన విక్రయ కేంద్రాలను ఆమె స్థానిక మండల వ్యవసాయాధికారి బుంగా రాజుతో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా దుకాణాలలో విత్తనాల స్టాక్, స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైతులకు విత్తనాల కొరత రాకుండా చూడాలని అన్నారు. విత్తనాలను ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ ధరకు విక్రయించకూడదన్నారు. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, రశీదు విధిగా తీసుకోవాలని రైతులకు సూచించారు. పక్క రాష్ట్రం నుంచి విత్తనాలను దిగుమతి చేసుకోవద్దని తెలిపారు. నకిలీ విత్తనాలు, లూజుగా విక్రయించే విత్తనాలు అమ్మే వారి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, డీలర్లు రాజేష్, చలసాని ప్రసాద్, విజయ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు



రోడ్డు వెంట ఆక్రమణలను తొలగిస్తున్న పోలీసులు

గరిడేపల్లి : ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గరిడేపల్లి ఎస్ఐ చలికంటి నరేష్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుకు ఇరుపక్కలా ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను, ఆక్రమణలను గురువారం పోలీస్ సిబ్బంది తొలగించారు. రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయంగా నిలిపిన వాహనాల యజమానులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. డ్రైవింగ్ ద్విచక్రవాహనదారులు హెల్మెటు, కార్ల వాహనదారులు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఓవర్ స్పీడ్, డ్రైవింగ్‌లో ఫోన్ మాట్లాడటం వంటివి చేయవద్దన్నారు. మద్యం సేవించి వాహనం నడవద్దన్నారు. ఫుట్ పాత్‌ల మీద వాహనాలు పార్కింగ్ చేస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ సురేష్‌రెడ్డి, యువరాజ్, అవినాష్, ప్రశాంత్‌కుమార్, గోపయ్య, సురేష్ కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి



వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

గరిడేపల్లి : రైతులు పంటలో అధిక దిగుబడుల కోసం ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలని పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. గురువారం గరిడేపల్లి మండలంలోని పొనుగోడు, పరెడ్డిగూడెం గ్రామాల్లో నిర్వహించిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. వానాకాలం పంటల సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షలకు మట్టిని సేకరించే విధానం, జీవ ఎరువుల వాడకంతో లాభాలను వివరించారు. చెరువు మట్టితో భూమికి ఉపయోగాలు, పచ్చిరొట్టె పంట ఆవశ్యకతను తెలిపారు. అధిక దిగుబడినిచ్చే విత్తన రకాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ, డ్రోన్ వినియోగం, పంటలలో చీడపీడల నివారణకు యాజమాన్య పద్ధతులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గడ్డిపల్లి కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ ఇన్‌చార్జ్ డి.నరేష్, భారతీయ వ్యవసాయ వరి పరిశోధన స్థానం ప్రిన్సిపాల్, సైంటిస్ట్ డాక్టర్ సీహెచ్.పద్మావతి, డాక్టర్ మానస, గడ్డిపల్లి శాస్త్రవేత్త ఎ.కిరణ్, వ్యవసాయ విస్తరణ అధికారి మనోజ్ కుమార్, స్వప్న, కార్యదర్శి, ఇఫ్‌కో ఫీల్డ్ ఆఫీసర్, పంతాంజలి కంపెనీ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

గురువయ్యగౌడ్‌కు నివాళి



గురవయ్యగౌడ్ చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : మంచి వ్యక్తి మన నుంచి దూరం కావడం బాధాకరమని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని కౌండిన్య ఫంక్షన్ హాల్‌లో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ యరగాని గురవయ్య గౌడ్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురువయ్య సింగిల్ విండో డైరెక్టర్‌గా, కౌన్సిలర్‌గా పనిచేసి తన వార్డు పరిధిలోనే కాకుండా పట్టణ ప్రజలలో కూడా మంచి పేరు తెచ్చుకున్న వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో పార్టీ, ప్రజాసంఘాల నాయకులు తన్నీరు మల్లికార్జునరావు, దొంతగాని శ్రీనివాస్, హరిబాబు, జక్కుల మల్లయ్య, అమర్‌నాథ్‌రెడ్డి, ముక్కంటి, వి.కృష్ణ గౌడ్, మహేష్, కె.వెంకన్న, సామ్యేల్, యోహాన్, వీరారెడ్డి, క్రాంతి కుమార్, శ్రీనివాస్, సైదులు, శ్రీనివాస్ రెడ్డి, ఉద్దండు, నాగు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మత రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న నాగారపు పాండు

హుజూర్‌నగర్ : బీజేపీ మత, కార్పొరేట్ రాజకీయాలకు వ్యతిరేకంగా సీపీఎం నిరంతరం పోరాడుతోందని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగారపు పాండు అన్నారు. గురువారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ప్రాంతీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ మూడవ సారి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని, రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తోందని ఆరోపించారు. మనువాద, కార్పొరేట్ విధానాలను అనుకూలంగా పాలన సాగిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి పల్లె వెంకటరెడ్డి, నాయకులు డి.బ్రహ్మం, యాకూబ్, వి.సైదులు, పి.హుస్సేన్, బాలునాయక్, శీలం శ్రీను, సోమయ్యగౌడ్, సైదయ్య, భిక్షం, యోనా, మురళి, వీరయ్య, వీరమల్లు, వెంకటరెడ్డి, సుశీల, కలమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూముల కౌలు వేలం



కౌలు వేలం పాటలో పాల్గొన్న దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ చైర్మన్, రైతులు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామ శివారులో గల స్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 25 ఎకరాల మాగాణి భూముల కౌలు వేలం పాట గురువారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఈ వేలం పాటకు పర్యవేక్షకులుగా దేవాదాయ శాఖ అధికారి తుమ్మల వెంకటచలపతి, ఆలయ ఈఓ సత్యనారాయణ హాజరయ్యారు. ఎనిమిది మంది రైతులు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనగా 19ఎకరాల మాగాణి భూమిని రామనబోయిన హుస్సేన్, ఆరు ఎకరాల మాగాణి భూమిని దాసరి సైదులు దక్కించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్ఐ బి.ప్రవీణ్‌కుమార్.. సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పాలిశెట్టి శ్రీనివాసరావు, ధర్మకర్తలు గోవింద రామారావు, గుడిపాటి వెంకటరమణ, ఇనుగుర్తి వీరాచారి, కొర్రా తులసి, వట్టె సైదులు, కొండా గోపయ్య, ఆలయ ప్రధాన అర్చకులు కందాళ శ్రీనివాసాచార్యులు, గ్రామపెద్దలు కాలె సామియేలు, గడ్డం చంద్రారెడ్డి, ఓరగంటి రవి, వేనేపల్లి రమేష్ బాబు, నరాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీపార్వతీ భీమలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఈఓ గుజ్జుల కొండారెడ్డి గురవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు 20 రోజులలోగా నల్లగొండలోని దేవాదాయ శాఖ ఏసీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి



సమావేశంలో పాల్గొన్న ఏఓ రాజు, పీఏసీఎస్‌ల సీఈఓలు, సిబ్బంది

మునగాల : వానాకాలం సీజన్‌లో రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని మునగాల మండల వ్యవసాయ అధికారి బుంగా రాజు కోరారు. వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లపై గురువారం మునగాలలోని రైతు వేదికలో మండలంలోని నాలుగు ప్రాథమిక సహకార సంఘాల సీఈఓలు, సిబ్బందితో ఏఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో యూరియా, ఇతర ఎరువుల కొరత రాకుండా ముందస్తుగా మార్క్‌ఫెడ్‌కు నగదు జమ చేసి ఎరువులను సకాలంలో తెప్పించాలని సూచించారు. అవసరమైతే మరిన్ని గోదాములను ఏర్పాటు చేసుకొని ఎరువులను నిలువ చేయాలని సూచించారు. ఈ పోస్ మిషన్ ద్వారా ఎరువులను విక్రయించాలని అన్నారు. కార్యక్రమంలో మునగాల, ఆకుపాముల, తాడువాయి, కొక్కిరేణి సహకార సంఘాల సీఈఓలు బసవయ్య, శ్రీనివాస్‌రావు, ప్రవీణ్‌రెడ్డి, సుధాకర్, సిబ్బంది గణేష్, గోపి, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఆలయ ప్రారంభోత్సవ కరపత్రం ఆవిష్కరణ



కంఠమహేశ్వరస్వామి ఆలయం వద్ద కరపత్రం ఆవిష్కరిస్తున్న గౌడ కుల పెద్దలు

చిలుకూరు : మండల కేంద్రంలో పాత చిలుకూరుకు వెళ్లే దారిలో అంతర్గంగ వంతెన వద్ద కల్లు గీత పారిశ్రామిక సంఘం, గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీకంఠమహేశ్వర సురామాంబదేవి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాన్ని విజయవంతం చేయాలని గౌడ కుల పెద్దలు కోరారు. ఈమేరకు గురువారం ఆలయం వద్ద కర పత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. వచ్చే నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఆలయ ప్రారంభోత్స వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌడపెద్దలు కొండా కోటయ్య, బెల్లంకొండ నాగయ్య, మరీదు సైదులు, మండవ అచ్చయ్య, అంబాల రాంబాబు, ముక్కా లక్ష్మీనారాయణ, కొండా శేషయ్య, కొండా వీరబాబు, కొండా వెంకయ్య, బాలేబోయిన రవి, బొడ్డు కాశయ్య, పవన్, సైదులు, ముక్కా వీరబాబు, కట్టేకోల లక్ష్మీనర్సు, గుండు వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

సాయిమందిరంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

మునగాల : మండల కేంద్రం శివారులోని శ్రీహరిహరసుత అయ్యప్ప దేవాలయం ప్రాంగణంలో గల శ్రీషిర్డీ సాయి మందిరంలో గురువారం మండల కేంద్రానికి చెందిన వేట లక్ష్మమ్మ కుమారుడు వేట శివాజీ –నాగలక్ష్మి దంపతుల సహకారంతో సాయి మందిరం నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలను నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాయిమందిరం నిర్వాహకులు దేవినేని రవి, భక్తులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పోలీస్ గృహాలు



మునగాలలో శిథిలావస్థకు చేరిన పోలీస్ క్వార్టర్స్



నిరుపయోగంగా ఉన్న ఎస్ఐ గృహం

- మూడేళ్లుగా నిరుపయోగం
- అద్దె ఇళ్లలో పోలీసులు నివాసం
- నూతన క్వార్టర్స్ నిర్మించాలని కోరుతున్న పోలీస్ సిబ్బంది

మునగాల : మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ వెనుక భాగాన ఉన్న పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్నాయి. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన 10 పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో గత రెండేళ్లుగా సిబ్బంది ఖాళీ చేశారు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. 1985లో నిర్మించిన ఈ నివాస గృహాలు పైపెచ్చులు ఊడి పడుతుండడంతో పోలీస్ కుటుంబాలు ఇబ్బందులు పడుతూ ఐదారేళ్ల పాటు కాలం వెళ్లదీశారు. వర్షం వస్తే భవనాలు కురుస్తుండడమే కాక క్వార్టర్స్ చుట్టూ పిచ్చి చెట్లు పెరగడంతో ఈ ప్రాంతం అడవిలా తయారైంది. మునగాల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐతో పాటు మొత్తం 26 మంది సిబ్బంది ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు ప్రస్తుతం అద్దె ఇళ్లలో ఉంటూ తమ విధులకు హాజరవుతున్నారు.

నిరుపయోగంగా ఉంటున్నాయి



ప్రస్తుతం మునగాల పోలీసుస్టేషన్ వెనుక ఉన్న పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో సిబ్బంది గత రెండేళ్లుగా నిరుపయోగంగా ఉంటున్నాయి. కూలేందుకు సిద్ధంగా ఉన్న ఈ క్వార్టర్స్‌లో ఉండేందుకు సిబ్బంది ఇష్టపడక మండల కేంద్రంలో అద్దె ఇళ్లల్లో ఉంటూ విధులకు హాజరవుతున్నారు.

– బి.ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ మునగాల

జీ ప్లస్ టూ క్వార్టర్స్ నిర్మించాలి..

ప్రస్తుతం పోలీస్ క్వార్టర్స్ ఉన్న ప్రాంతంలో జీ ప్లస్ టూ పద్ధతిలో క్వార్టర్స్ నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని పోలీస్ సిబ్బంది కోరుతున్నారు. క్వార్టర్స్‌లో మనుషుల సంచారం లేకపోవడంతో విష పురుగులు, పాములు సంచరిస్తున్నాయని చెబుతున్నారు. యుద్ధప్రాతిపదికన పోలీస్ క్వార్టర్స్‌ను పూర్తిగా తొలగించాలని సిబ్బంది కోరుతున్నారు.

డ్రెయినేజీ లేక రోడ్లపైనే మురుగు



రోడ్డుపైనే పారుతున్న మురుగు నీరు

నడిగూడెం : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో పలు వీధుల్లో డ్రెయినేజీ లేక ఇళ్లలోని మురుగు నీరు రోడ్లపైనే పారుతోంది. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. వీధుల్లో మురుగు నలిచి దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు, ఈగలు బెడదతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు డ్రెయినేజీలు నిర్మించాలని కోరుతున్నారు.

వైభవంగా నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లిలోని శ్రీలక్ష్మినరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మి నరసింహస్వామి నిత్య, శాశ్వత కల్యాణాన్ని వేద పండితులు గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రాతఃకాలార్చన, సుప్రభాతసేవ, నిత్య అగ్నిహోత్రి, పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్ర నామార్చలు గావించారు. నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం జరిపించారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్యధారణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనర్సింహమూర్తి పాల్గొన్నారు.

డ్రగ్స్, సైబర్ నేరాల నిర్మూలనపై అవగాహన

సూర్యాపేటటౌన్ : డ్రగ్స్‌ను నిర్మూలించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని షీటీఎం ఎస్ఐ నీలిమ అన్నారు. హనుమాన్ నగర్‌లోని ప్రభుత్వ నంబర్–1 ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల వేసవి శిక్షణ శిబిరానికి హాజరై మాట్లాడారు. డ్రగ్స్ నిర్మూలన, సైబర్ మోసాల పట్ల జాగ్రత్తలు, వీటి నివారణలో ఉపాధ్యాయుల పాత్ర అనే అంశాలపై స్థానిక షీటీమ్స్, పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. హెచ్‌ఎం యతిపతి రావు, జిల్లా రిసోర్స్ పర్సన్లు వేల్పుల వెంకటేశ్వర్లు, అంకతి వెంకన్న, మధుసూదన్ రెడ్డి, ఖాదర్ పాషా, మధు, షీ టీం మహిళా కానిస్టేబుల్ ఉమా, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దివ్యాంగులను ఆదుకోవాలి

మునగాల : రాష్ట్రంలోని దివ్యాంగులను ప్రభుత్వం ఆదుకోవాలని జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ కోరారు. గురువారం మునగాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అన్నారు. దివ్యాంగుల చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి దివ్యాంగుడికి రూ.లక్ష రుణం ఇవ్వాలని కోరారు.

రోడ్డెక్కితే దుర్వాసన !



కలకోవకు వెళ్లే రహదారి వెంట పారబోసిన కోళ్ల వ్యర్థాలు

నడిగూడెం : నడిగూడెం మండల కేంద్రం నుంచి కలకోవకు వెళ్లే రోడ్డు వెంట నడిగూడెంకు చెందిన పలువురు వ్యాపారులు కోళ్ల వ్యర్థాలు, పలు షాపులకు చెందిన చెత్తాచెదారం పారబోస్తున్నారు. దీంతో దుర్వాసనతో రోడ్డు వెంట వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే రోడ్డు వెంట వ్యర్థాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముంది. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా యూటీ వంతెన



చాకిరాల సమీపాన సాగర్ ఎడమ కాల్వ యూటీ వంతెనపై రెయిలింగ్ లేని దృశ్యం

నడిగూడెం : మండలంలోని చాకిరాల సమీపాన సాగర్ ఎడమ కాల్వ 122 కిలో మీటర్ వద్ద యూటీపై ఉన్న వంతెన ప్రమాదకరంగా ఉంది. యూటీ వంతెనపై గత ఏడాది రెయిలింగ్ నిర్మించారు. రెయిలింగ్‌ను నాసిరకంగా నిర్మించడంతో ఏడాదికే కాల్వ వైపు రెయిలింగ్ కూలింది. ఈ ప్రాంతం రైతులు.. ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలపై నిత్యం ఈ మార్గం గుండా రాకపోకలు కొనసాగిస్తుంటారు. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి వంతెనపై రెయిలింగ్ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.